సొంత భవనాలు కరువు

- కొత్త జీపీలు ఏర్పాటైనప్పటి నుంచి అద్దె భవనాలే దిక్కు!
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు, అధికారులు

గోపాల్‌పేట: చిన్న గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తే పాలనకు సౌలభ్యంగా ఉంటుందని, గ్రామాల్లోనే ప్రజలకు కావాల్సిన పనులు జరుగుతాయని ఆలోచించిన రాష్ట్ర ప్రభుత్వం ఐదేళ్ల క్రితం కొత్త గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేసింది. దీనికి అనుగుణంగా ఆయా గ్రామ పంచాయతీలకు అధికారులు, సిబ్బందిని నియమించారు. గ్రామ పంచాయతీలు ఏర్పాటు అయినప్పటి నుంచి రేవల్లి మండలంలోని రేవల్లి, చెన్నారం, పాతతండాలను పంచాయతీలుగా ఏర్పాటు చేసి పాలన కొనసాగిస్తున్నారు. కానీ ఉమ్మడి మండల వ్యాప్తంగా చూసుకుంటే పది గ్రామ పంచాయతీలకు సొంత భవనాలు లేవు.

ఉమ్మడి మండలంలో..

2019–20లో మంజూరైన కొత్త గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం కోసం ప్రభుత్వం అప్పట్లో రూ.16 లక్షల చొప్పున మంజూరు చేసింది. 2020 తర్వాత మంజూరైన జీపీల నిర్మాణానికి రూ.21 లక్షలు మంజూరయ్యాయి. ఉమ్మడి గోపాల్‌పేట మండలంలోని గొల్లపల్లి, గౌరిదేవిపల్లి గ్రామాల్లో కొత్త జీపీల నిర్మాణాల కోసం భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కేశంపేటలో స్లాబ్ లెవెల్ వరకు నిర్మించి పనులు నిలిపేశారు. శానాయిపల్లిలో పాఠశాల భవనంలోనే గ్రామ పంచాయతీ కార్యాలయం కొనసాగుతోంది. అలాగే తల్పునూరులో భవన నిర్మాణం పూర్తయి ప్లాస్టరింగ్ స్టేజీలో ఉంది. అనంతపురం, ఆముదాలకుంట, లక్ష్మీతండా, కర్ణమయ్యకుంటతండా, పాటిగడ్డతండా పంచాయతీలకు రూ.21 లక్షల చొప్పున డబ్బులు మంజూరయ్యాయి. కానీ టెండర్లు పూర్తయి బిల్డింగుల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ప్రస్తుతం ఇవి అద్దె భవనాల్లోనే కొనసాగుతుండడంతో కనీస సౌకర్యాలు లేక అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఆయా గ్రామాల్లోని ప్రజలు సైతం సొంత గ్రామ పంచాయతీలు ఉంటేనే బాగుంటుందని, మహిళా అధికారులు ఉన్నచోట తీవ్ర సమస్య ఉందని చెబుతున్నారు. ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి గ్రామపంచాయతీ భవనాలు వేగంగా నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



గౌరిదేవిపల్లిలో పాత అంగన్‌వాడీ సెంటర్‌లో కొనసాగుతున్న పంచాయతీ కార్యాలయం

అందుబాటులోకి తీసుకురావాలి

మా గ్రామ పంచాయతీ భవన నిర్మాణం ప్రారంభమై దాదాపు నాలుగేళ్లు దాటిపోయింది. ఇప్పటి వరకు పూర్తి కాలేదు. స్లాబ్ లెవల్ వరకే పనులు ఆగిపోయాయి. పంచాయతీ భవనం పూర్తయితే పరిపాలనకు బాగుంటుంది. ఆగిపోయిన పనులు తిరిగి వెంటనే ప్రారంభించి, భవనం నిర్మాణం పూర్తి చేయాలి.

– సురేష్‌గౌడ్, కేశంపేట

టెండర్ల దశలోనే ఉన్నాయి

గోపాల్‌పేట మండలంలో అనంతపురం, లక్ష్మీతండా, కర్ణమయ్యకుంట, పాటిగడ్డతండా పంచాయతీలకు రూ. 21 లక్షల చొప్పున నిధులు మంజూరయ్యాయి. కానీ అవి ప్రస్తుతం టెండర్ల దశలోనే ఉన్నాయి. ఆముదాలకుంటతండాకు నిధులు మంజూరు కాలేదు. టెండర్లు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించి నిర్మాణాలు పూర్తి చేస్తాం.

– ఉసేనప్ప, ఎంపీడీఓ, గోపాల్‌పేట

క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రానికి చెందిన వెంకటయ్యగౌడ్ కొన్ని రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం విషయం తెలుసుకున్న హనుమాన్ క్రికెట్ టీం, వాలీబాల్ క్రీడాకారులు కిట్టు స్వామి, వెంకటన్నగౌడ్, శేఖర్, రవిరాజు, గుంటికృష్ణయ్య, ఉల్లోజిరావు, గణేష్, రామచంద్రయ్య, తిరుపతయ్య, దక్షిణామూర్తి, భీసన్న, వెంకటేష్, బాలరాజు, రాజశేఖర్, కిషోర్‌రావు, మేదరి శ్రీనివాస్, నటరాజు, బాల్మియా కలిసి బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి రూ.23 వేలు ఆర్థికసాయం అందించారు.

కార్మికుల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



మదనాపురం: హమాలీ కార్మికులకు ప్రభుత్వాలు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి బీమా పథకాన్ని అమలు చేయాలని సీఐటీయూ వనపర్తి జిల్లా ఉపాధ్యక్షుడు బొబ్బిలి నిక్సన్ డిమాండ్ చేశారు. సోమవారం మండల హమాలీ సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రోడ్డుపైకి వచ్చి పనులు చేసే హమాలీలకు ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియని పరిస్థితులు ఉన్నాయన్నారు. కార్మికులకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్, నాగరాజు, నరేందర్, విజయ్, రమేష్, ఆంజనేయులు, వెంకటస్వామి పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేసే వరకు పోరాటం



వీపనగండ్ల: ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని హైదరాబాద్‌లో మూడు దళిత సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహా ర్యాలీకి మండల కేంద్రం నుంచి పలువురు నాయకులు బయలుదేరారు. తెలంగాణ దండోరా, ఎమ్మార్పీఎస్, మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో మాదిగ, మాదిగ ఉప కులాల మహా ర్యాలీని జయప్రదం చేసేందుకు హైదరాబాద్ వెళ్తున్నట్లు తెలంగాణ దండోరా యువసేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మీసాల నాగరాజు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి ఎస్సీ వర్గీకరణ బిల్లుకు చట్టబద్ధత కల్పించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మీసాల శివ, ప్రసాద్, సహదేవుడు, గడ్డమీది రామకృష్ణ, గంగూలి, శివ తదితరుల ఉన్నారు.

విద్యార్థులు ఒత్తిడికి గురికావొద్దు



పాన్‌గల్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షలను ఒత్తిడి, భయం లేకుండా రాయాలని వాసవీ సేవా సమితి జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్‌శెట్టి అన్నారు. సోమవారం మండలంలోని చింతకుంట ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు, పెన్సిల్, స్కేల్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు పరీక్షలు అంటే భయాన్ని వీడాలని, సమయాన్ని సద్వినియోగం చేసుకుంటూ సన్నద్ధం అవ్వాలని సూచించారు. విద్యార్థులకు సామగ్రి పంపిణీ చేయడంపై పాఠశాల హెచ్ఎం ప్రభాకర్ ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.

స్వచ్ఛభారత్‌పై అవగాహన సదస్సు

గోపాల్‌పేట: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా అధికారులు, ప్రజాప్రతినిధులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ సంధ్య పాల్గొని మాట్లాడారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా గ్రామాల్లో చెత్త సేకరణ, తడి, పొడి చెత్త, డంపింగ్‌యార్డుల నిర్వహణ వంటి కార్యక్రమాలపై మండల, గ్రామ స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు ఎప్పటికప్పుడు సమీక్షించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ శేఖర్, జిల్లా కోఆర్డినేటర్ రమేష్, ఎంపీడీఓ ఉసేనప్ప తదితరులు పాల్గొన్నారు.



మహిళా సమాఖ్య డబ్బులు స్వాహా

వీపనగండ్ల: మండల కేంద్రంలోని మొదటి గ్రామ మహిళా సమాఖ్య లీడర్లు తమ సంఘంలో చేరి వివిధ రకాల రుణాలు తీసుకున్న సభ్యుల నుంచి రికవరీ చేసిన దాదాపు రూ.3.55లక్షలను బ్యాంకు అకౌంట్‌లో జమచేయకుండా తమ సొంత అవసరాలకు వాడుకున్నారు. ఈ విషయమై వారం రోజుల క్రితం డీఆర్‌డీఏ జిల్లా అధికారులు మండల సమాఖ్య కార్యాలయంలో పూర్తి స్థాయి విచారణ జరిపి సొంత అవసరాలకు వాడుకున్న డబ్బులను 20వ తేదీ వరకు బ్యాంకు ఖాతాలో జమ చేయాలని ఆదేశించారు. గ్రామంలోని మొదటి గ్రామ సమాఖ్య సంఘంలో అన్నపూర్ణ, భారతి, రాజరాజేశ్వరి, గాయత్రి, సత్యసాయి తదితర 22 సంఘాల నుంచి వసూలు చేసిన డబ్బులను తమ సొంత అవసరాలకు వాడుకున్నామని ఆ సంఘ అధ్యక్షురాలు ఎల్లమ్మ, కోశాధికారి చెన్నమ్మ, వీఓఏ ఈశ్వరయ్య ఒప్పంద పత్రంపై అధికారుల సమక్షంలో సంతకాలు చేశారు. కానీ డబ్బులను మాత్రం తిరిగి బ్యాంకులో జమ చేయలేదు. ఈ విషయంపై ఏపీఎం రాజశేఖర్‌రెడ్డిని వివరణ కోరగా రూ.3.55లక్షలు సంఘంలోని వారు సొంత అవసరాలకు వాడుకున్న మాట వాస్తవమేనని. ఒప్పందం ప్రకారం చెల్లించకపోవడంతో వీరిపై చర్య తీసుకోవాలని ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

అమరచింత: అకాల వర్షాలకు పంటలను నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏఐకేఎస్ జిల్లా అధ్యక్షుడు రాజన్న డిమాండ్ చేశారు. ఆత్మకూర్ పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నాలుగు రోజుల కిందట కురిసిన అకాల వర్షంతో పాటు ఈదురు గాలులకు వరి, చెరకు, మిరప, మామిడి తోటలు తీవ్రంగా నష్టపోయాయన్నారు. ఆరుగాలం పొలాల్లో శ్రమించి పంటలను కాపాడుతున్న రైతులకు అకాల వర్షాలు తీవ్ర నష్టాలను కలిగించాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా పంటల బీమా పథకం ఐదేళ్లుగా అమలు కావడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో సామేలు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రాజన్న

బకాయి కూలి డబ్బులు విడుదల చేయండి

అమరచింత: ఉపాధిహామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు పెండింగ్ కూలి డబ్బులను వెంటనే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు అజయ్ డిమాండ్ చేశారు. మండలంలోని పాంరెడ్డిపల్లిలో సోమవారం ఉపాధి పనులు చేస్తున్న కూలీలను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఐదు వారాల నుంచి కూలీలకు డబ్బులు ఇవ్వడం లేదన్నారు. ఉగాది పండుగ పూట కూలీలు పస్తులుండే పరిస్థితులు దాపరించాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం కూలీలు పనులు చేస్తున్నా పని ప్రదేశం నుంచి పొటోలను తీసి ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయడం ఏమిటని ప్రశ్నించారు. గ్రామాల్లో 20 పనుల కంటే ఎక్కువ పనులు పెట్టరాదనే నిబంధన తొలగించాలన్నారు. ఏడాదికి 200 రోజుల పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంతారెడ్డి, ఇందిరమ్మ, సువర్ణ, బుచ్చన్న, మొగిలన్న, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అజయ్

‘కంటివెలుగు’ను సద్వినియోగం చేసుకోవాలి

పాన్‌గల్: అంధత్వ నివారణ కోసం ప్రభుత్వం ఉచితంగా నిర్వహిస్తున్న కంటి వెలుగును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్ రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని రేమద్దులలో నిర్వహిస్తున్న కంటివెలుగు శిబిరాన్ని ఆయన సందర్శించి పరీక్షలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ కంటి పరీక్షలు చేయించుకునేలా సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పించి ఎక్కువ మంది పరీక్షలు చేయించుకునేలా చూడాలన్నారు. దొండాయిపల్లి, తెల్లరాళ్లపల్లితండాలో కంటి వెలుగు శిబిరాలు కొనసాగుతున్నాయన్నారు.

కంచిరావుపల్లి తండాలో..

పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లితండాలో కంటివెలుగు శిబిరాన్ని సోమవారం ఎంపీపీ ఆవుల శైలజ, సర్పంచ్ గోపమ్మ, ఎంపీటీసీ రాధ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పేదల కోసం రెండో విడత కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ మన్నెమ్మ, నాయకులు కురుమూర్తి, లాలునాయక్, యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


కంచిరావుపల్లితండాలో అద్దాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

173 మందికి..

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండలంలోని తాటిపాముల పంచాయతీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కంటి వెలుగు శిబిరంలో 173 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని మండల వైద్యాధికారి రాముడు తెలిపారు. వారిలో ముగ్గురికి అద్దాలు అందించగా.. 10 మందికి అవసరమైన అద్దాల తయారీకి పంపించామన్నారు. ముగ్గురిని ఆపరేషన్ అవసరం ఉన్న వారీగా గుర్తించామని తెలియజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పవన్‌కుమార్, ప్రియాంక, సూపర్‌వైజర్ సత్యమ్మ, ఏఎన్ఎం, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

పట్టణాభివృద్ధికి నిధులు ఇవ్వండి

అమరచింత: మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు కేటాయించాలని సీడీఎంఏ డాక్టర్ సత్యనారాయణకు మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, కమిషనర్ మహమ్మద్‌ఖాజా వినతిపత్రం అందించారు. హైదరాబాద్‌లోని సీడీఎంఏ కార్యాలయానికి సోమవారం వెళ్లిన మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ పట్టణంలో చేపట్టాల్సిన పనులకు అయ్యే నిధులు మంజూరు చేయాలని కోరారు. పట్టణం మొత్తంలో సీసీ రహదారుల కోసం రూ.11 కోట్లు కేటాయించాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని తాగునీటి కష్టాలు ఏర్పడకుండా మున్సిపాలిటీకి నిధులను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపాలిటీ ఏర్పాటు కాక ముందు అమరచింత జీపీలో మిగిలి ఉన్న రూ.26 లక్షలు వినియోగించుకోవడానికి అవకాశం కల్పించాలని కోరారు. ఈమేరకు సీడీఎంఏ సత్యనారాయణ మున్సిపాలిటీ అభివృద్ధి కోసం తన వంతు సహకారం అందిస్తానని హామీ ఇచ్చినట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రాజ్‌కుమార్, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ నాగభూషణంగౌడ్ పాల్గొన్నారు.


సీడీఎంఏ సత్యనారాయణకు పూల మొక్క అందిస్తున్న మంగమ్మ

చర్యలు తీసుకోవాలి

వనపర్తి క్రైం: ఉగాది పండుగను ఆసరాగా చేసుకొని కొందరు వ్యాపారులు బెల్లం అధిక ధరలకు విక్రయిస్తున్నారని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష ఐక్యవేదిక నాయకుడు సతీష్ యాదవ్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దీనిపై పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి గాయాలు

అమరచింత: కోళ్లను తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొని వ్యక్తి గాయాలైన ఘటన ఆరేపల్లి సమీపంలో సోమవారం చోటుచేసుకుంది. బాధిత తెలిపిన వివరాల మేరకు.. ఆత్మకూర్ పట్టణంలోని నేతాజీ నగర్‌కు చెందిన శ్రీనివాస్‌రెడ్డి వీరరాఘవపురం గ్రామానికి బైక్‌పై వెళ్తుండగా ఆరేపల్లి శివారులో కోళ్ల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టడంతో గాయాలయ్యాయని తెలిపారు. ఆత్మకూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితుడు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించాడు. దీనిపై కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఇందిరమ్మ విగ్రహం ఏర్పాటుకు అనుమతి ఇవ్వండి

అమరచింత: ఆత్మకూర్ మండలంలోని రేచింతలలో మాజీ ప్రధాని ఇందిరాగాంధీ విగ్రహం ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వాలంటూ ఎంపీడీఓ వెంకటేశ్వర్లుకు కాంగ్రెస్ నాయకులు సోమవారం వినతిపత్రం అందించారు. రేచింతలలో ఇందిరమ్మ విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించామని, అందుకోసం ప్రభుత్వ పరంగా అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆత్మకూర్ జెడ్పీటీసీ మాజీ సభ్యుడు బాలకిష్టన్న, ఎంపీటీసీ పరమేశ్, నాయకులు శ్రీనివాసులు, విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీనివాసులు, గణేష్, చికెన్ వెంకటన్న తదితరులు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంపై ప్రత్యేక దృష్టి

పాన్‌గల్: వేసవి కాలం దృష్ట్యా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని బహదూర్‌గూడెంలోని నర్సరీని ఆయన పరిశీలించారు. మొక్కలకు క్రమం తప్పకుండా రోజు నీళ్లు పట్టాలని, నీడ ఏర్పాటు చేయాలని, ఎండిన మొక్కల స్థానంలో నూతన మొక్కలను పెంచాలని ఆదేశించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు వంద శాతం మొక్కలను పెంచాలన్నారు. దీంతో పాటు మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లిలో ఎస్‌డీఎఫ్ నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు విష్ణునాయుడు, నాగేశ్ నాయుడు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


మొక్కలు పరిశీలిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి

కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తున్న కేంద్రం

ఖిల్లాఘనపురం: కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు కొమ్ముకాస్తూ పేదలను విస్మరిస్తుందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట అంజనేయులు, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి పరమేశ్వర్‌చారి ధ్వజమెత్తారు. సోమవారం మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం భవనంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మండల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ పేదలకు భారాలు, ధనవంతులకు వరాలు అన్నట్లుగా కేంద్రం వ్యవహరిస్తుందని ఆరోపించారు. ఉపాధి పనులకు వచ్చే వారికి 200 పనిదినాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

రాజకీయ లబ్ధికోసమే కవితపై వేధింపులు


పూజలు చేస్తున్న ఉపాధిహామీ పథకం ఉద్యోగులు

కొత్తకోట: సీఎం కేసీఆర్ కుటుంబంపై రాజకీయ కక్ష సాధింపు కోసమే ఎమ్మెల్సీ కవితపై కేంద్రం ఈడీని ఉసిగొల్పుతుందని ఉపాధిహామీ ఉద్యోగుల జేఏసీ జిల్లా నాయకుడు ఆంజనేయులు అన్నారు. ఈ సందర్భంగా కవితపై వచ్చిన ఆరోపణలు అన్ని తొలిగిపోవాలని సోమవారం కోటిలింగేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా సెర్ప్ ఉద్యోగులకు ప్రభుత్వం పే స్కేల్ అమలు చేసినట్లు ఉపాధి హామీ ఉద్యోగులకు కూడా పే స్కేల్ అమలు చేయాలని ఆయన కోరారు. 17 ఏళ్ల పాటు కొనసాగుతున్న ఉపాధి హామీ ఉద్యోగుల కష్టాలను ప్రభుత్వం గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఉద్యోగులు సత్యనారాయణ, రాములు, అక్షిత, ధనుంజయ్‌రాజు, శ్రీనివాసులు, రాములు, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఏకం కావాలి

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని తెలంగాణ తల్లి విగ్రహం వద్ద సోమవారం ఎమ్మెల్యే ఈటల రాజేందర్ జన్మదినం సందర్భంగా ముదిరాజ్ సంఘం యువకులు కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా యువకులు మాట్లాడుతు ముదిరాజ్‌ల ఉన్నతిని రాష్ట్ర వ్యాప్తంగా చాటిన వ్యక్తి ఈటల రాజేందర్ అన్నారు. మునుముందు రాష్ట్రంలోని ముదిరాజ్‌లను ఏకం చేసేందుకు ఆయన ముందుకు వస్తే తామంతా వెన్నంటి ఉంటామన్నారు. కార్యక్రమంలో అంజనేయులు, పురుషోత్తం, రాము, శివరామకృష్ణ, శివకృష్ణ, బాలకృష్ణ, పవన్, మహేష్, నారాయణ, వెంకటయ్య, మహేందర్, చందు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.



నిరుద్యోగుల జీవితాలతో చెలగాటం వద్దు

వనపర్తి క్రైం: నిరుద్యోగులు ఎంతో కష్టపడి చదివితే ప్రభుత్వం పేపర్ల లీకేజీలతో వారి జీవితాలతో ఆడుకుంటుందని, దీనికి బాధ్యత వహిస్తూ మంత్రి కేటీఆర్ రాజీనామా చేయాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జ్ బోసుపల్లి ప్రతాప్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని శ్రీలక్ష్మి కృష్ణ గార్డెన్‌లో వనపర్తి నియోజకవర్గ వర్క్‌షాప్ సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలో 290 బూత్‌లకు 30మంది సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేసి ఎన్నికలకు సిద్ధం చేయాలన్నారు. సీఎం కేసీఆర్ చేస్తున్న అరాచక పాలనకు చరమగీతం పాడే రోజులు దగ్గర్లో ఉన్నాయని, వచ్చే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజవర్ధన్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కృష్ణ, సబ్బిరెడ్డి, జిల్లా నాయకులు జింకల కృష్ణయ్య, నారాయణ, శ్రీశైలం తదితరులు ఉన్నారు.


మాట్లాడుతున్న బోసుపల్లి ప్రతాప్

ఏబీవీపీ ఆధ్వర్యంలో ర్యాలీ..

వనపర్తి టౌన్: టీఎస్‌పీఎస్‌సీ ప్రశ్న ప్రత్రాల లీకేజీలపై సీఎం కేసీఆర్ బాధ్యత వహిస్తూ.. రాజీనామా చేయాలని ఏబీవీపీ నగర కార్యదర్శి బాలకృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏబీవీపీ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సోమవారం జిల్లా కేంద్రంలో ర్యాలీ నిర్వహించి అనంతరం అంబేడ్కర్ చౌక్‌లో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రశ్న పత్రాల లీకేజీ పై హై కోర్టు సిట్టింగ్ జడ్జీతో విచారణ జరిపించాలని, టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జగదీశ్, భవిత, ప్రణీత, కేదార్‌నాథ్, చింటు, శివ తదితరులు పాల్గొన్నారు.


నిరసన తెలుపుతున్న ఏబీవీపీ నాయకులు

ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం

పెబ్బేరు: పట్టణంలో అంబేడ్కర్ నగర్ ప్రాథమిక పాఠశాలలో సోమవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ తరగతి గదిలో తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించారు. అలాగే ఒక రోజు ఉపాధ్యాయులుగా పాఠశాలలో ఉండడం చాలా సంతోషకరంగా ఉందని వారు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మణ్, ఉపాధ్యాయులు వెంకటస్వామి, కవిత, నర్మద, శ్యామల, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



శివాలయంలో అన్నదానం



కొత్తకోట రూరల్: మాస శివరాత్రిని పురస్కరించుకొని పెద్దమందడి మండలంలోని పామిరెడ్డిపల్లి శివారులో వైరాలగుట్టపై వెలసిన శివాలయం, గణపతి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన డీలర్ లక్ష్మణ్‌గౌడ్ అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు మాట్లాడుతూ ప్రతి మాస శివరాత్రికి ఆలయంలో పూజలు చేయడంతో పాటు అన్నదానం చేస్తామని, దాతలు ముందుకు రావాలని కోరారు. పూజలో యాదవరెడ్డి, చెన్నారెడ్డి, దత్తాత్రేయరెడ్డి, బుచ్చిరెడ్డి, కొంకలి బుచ్చయ్య, మహేష్, అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి

మదనాపురం: మండలంలోని అగ్రహారం గ్రామంలో ప్రభుత్వ స్థలంలో గుడిసెలు వేసుకొని జీవనం సాగిస్తున్న బుడగ జంగాల వారికి పట్టా ఇవ్వాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు రాజు డిమాండ్ చేశారు. సోమవారం అగ్రహారంలో బుడగజంగాల వారిని కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ 20ఏళ్లుగా సంచార జాతులుగా ఉన్న బుడగజంగాల వాళ్లు ఎలాంటి ఆధారం లేకుండా గ్రామంలో జీవిస్తున్నారన్నారు. వారికి 58, 59 జీఓ ప్రకారం ఇళ్ల స్థలాల పట్టాలు ఇచ్చి డబుల్ బెడ్ రూం ఇళ్లు నిర్మించాలని డిమాండ్ చేశారు.



విరిగిన చెట్ల తొలగింపులో నిర్లక్ష్యం

అమరచింత: ఈదురు గాలులు, వర్షానికి ప్రధాన రహదా రి వెంట ఉన్న చెట్లు విరిగిపడినా ఆర్అండ్‌బీ అధికారులు పట్టించుకోవడం లేదు. అమరచింత, ఆత్మకూర్ ప్రధాన రహదారిలో సింగంపేట స్టేజీ సమీపంలో చెట్లు విరిగి రహదారిపై పడ్డాయి. మూడు రోజుల క్రితం విరిగిన చెట్లను రహదారిపై నుంచి తొలగించలేకపోతున్నారు. దీంతో రాత్రివేళలో రహదారిపై ప్రయాణం చేస్తున్న వాహనదారులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి విరిగి పడిన చెట్లను తొలగించాలని కోరుతున్నారు.

